



అక్రమ లేఅవుట్‌ను తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)



మద్దిలేరు వాగు ఆక్రమణను తొలగిస్తున్న దృశ్యం

అన్నింటా అక్రమాలే..!

- వైసీపీ హయాంలో విచ్చలవిడితనం
- భూకబ్జాలు, ఫోర్జరీలతో పేట్రేగిన ఆ పార్టీ నాయకులు
- కూటమి పాలనలో ఉక్కుపాదం
- ఆక్రమణల కూల్చివేత.. కేసుల నమోదు
- అజ్ఞాతంలోకి వైసీపీ నేతలు?

కదిరి, సెప్టెంబరు 30: గత వైసీపీ పాలనలో విచ్చలవిడితనం పరాకాష్టకు చేరిందన్నది బహిరంగ రహస్యమే. ఆ పార్టీ నాయకులు.. తమకు ఎదురే లేదన్నట్లుగా రెచ్చిపోయారు. భూకబ్జాలు, ఫోర్జరీ పత్రాలతో ఆస్తులు కాజేయడం, నిబంధనల ఉల్లంఘన ఇలా.. అన్నింటా అడ్డగోలుగా వ్యవహరించారు. అక్రమాలకు పాల్పడ్డారు. ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం వీటిపై ఉక్కుపాదం మోపుతోంది. వైసీపీ నాయకుల భూకబ్జాలు, అక్రమాలకు చెక్ పడింది. ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకుంటోంది. నియోజకవర్గంలో అక్రమాలు, భూకబ్జాలు, ఫోర్జరీ కేసుల్లో వైసీపీ నాయకులు నిందితులుగా ఉన్నారు. ఒక్కొక్కటిగా వారు చేసిన అన్యాయాలు, అక్రమాలు బయట పడుతున్నాయి. వారిపై కేసులు నమోదు చేస్తోంది. ఇప్పటికే పలువురు వైసీపీ నాయకులను అరెస్టు చేశారు. మరికొంతమంది అరెస్టుల భయంతో పరారీలో ఉన్నట్లు సమాచారం. అంతేకాదు, వైసీపీ నాయకులు అండతో రెచ్చిపోయిన అధికారులకు కూడా ఇబ్బందులు తప్పట్లేదు. వారిపై కేసులు నమోదవుతున్నాయి.

పరారీలో వైపీపీ నాయకులు

కదిరిలోని సీ అండ్ చర్చి ఆస్తిని అక్రమంగా ఫోర్జరీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన కేసులో పలువురు వైసీపీ నాయకులు నిందితులుగా ఉన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ తరఫున అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన మగ్బుల్ అహమ్మద్‌తోపాటు, వైసీపీ నాయకులు పరిగి షామీర్, హర్షద్ తోపాటు మరికొంతమంది వైసీపీ నాయకులు నిందితులుగా ఉన్నారు. వారందరూ పోలీసులు అరెస్టు చేస్తారన్న భయంతో అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. ఈ కేసులో ముందస్తు బెయిల్‌కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ప్రజలు మాత్రం అరెస్టు భయంతోనే పరారీలో ఉన్నట్లు చర్చించుకుంటున్నారు.



అక్రమ మైనింగ్‌కు పాల్పడిన క్వారీ

అక్రమాలు ఇవీ..

తలుపుల మండలం కుర్లి పంచాయతీకి చెందిన కుర్లి శివారెడ్డి గత వైసీపీ పాలనలో హంద్రీనీవా కాలువ నిర్మాణం కోసం ఉంచిన ఇనుప కడ్డీలను చోరీ చేశాడు. గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. కూటమి అధికారంలోకి రాగానే సీరియస్‌గా పరిగణించింది. నిందితులపై కేసు నమోదు చేయించారు. అరెస్టు చేసి, జైలుకు పంపారు.

కదిరిలోని అడపాల వీధిలో దాదాపు రూ.20కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలంలో మూడుసెంట్లు చొప్పున ఆక్రమించుకుని, ఇళ్లు నిర్మించారు. కూటమి అధికారంలోకి రాగానే వీటిని నేలమట్టంచేసి, ప్రభుత్వ భూమిని కాపాడారు. దీని చుట్టూ కంచెవేసి, ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామని అధికారులు చెబుతున్నారు.

కదిరి ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఉన్న 30 సెంట్ల స్థలాన్ని వైసీపీ నాయకులు ఆక్రమించుకుని, అనుమతుల్లేకుండానే బేసి మట్టాలు వేశారు. దీనిపై గతంలో కూడా టీడీపీ ఆందోళనలు చేసింది. కూటమి అధికారంలోకి రాగానే వీటిని నేలమట్టం చేసింది. రూ.కోటి విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడింది.

మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, వైసీపీ నాయకుడు సాదిక్ మున్సిపాలిటీలోని తుక్కును అక్రమంగా తరలించడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ కొనసాగుతోంది.

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగాదేవి... మహిళా సంఘాల సభ్యుల డబ్బు అక్రమంగా వాడుకోవడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ కొనసాగుతోంది. ఈ స్వాహా వ్యవహారంపై గత ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు.

దేవరచెరువులో చేపలు పట్టే విషయమై దౌర్జన్యంగా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైసీపీ నాయకుడు వజ్ర భాస్కర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేసి, దళితులకు అండగా నిలిచారు.

గతంలో పనిచేసిన సీఐ మధు, కదిరి మండలంలోని ఎర్రదొడ్డి గ్రామానికి ఉదయ్‌కుమార్ అనే దళిత యువకుడిని వేధించి, కొట్టడంతో అతడి చెవి పనిచేయకుండా పోయింది. తరచూ వేధింపులకు గురి చేయడంతో ఆ యువకుడు భరించలేక రెండురోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో వైసీపీ అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరించి యవకుడి ప్రాణాలను బలిగొన్న కారణంగా సీఐ మధుపై కేసు నమోదు చేశారు.

అక్రమ లేఅవుట్లను నియంత్రించడంలో భాగంగా కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. పలువురు వైసీపీ నాయకులకు సంబంధించిన లేఅవుట్లను తొలగించారు. వైసీపీ నాయకులు వజ్ర భాస్కర్‌రెడ్డి, పీఎం షైనూ, అత్తార్ చాంద్‌బాషా తదితరులు వేసిన లేఅవుట్లను తొలగించారు.

వైసీపీ నాయకుడు ప్రణీత్‌రెడ్డికి చెందిన శివసాయి కంకర మిషన్‌లో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ చేస్తున్నట్లు సంబంధిత శాఖాధికారులు గుర్తించి, సీజ్ చేశారు. దాదాపు రూ.13 కోట్లు జరిమానా విధించారు.

ఖాద్రీశుడి ఆలయ కోనేటి సమీపాన మద్దిలేరు వాగుపై వైసీపీ నాయకుడు అక్రమంగా నిర్మించిన గోడను మున్సిపల్ అధికారులు తొలగించారు.



నర్సరీలో ఉన్న టమోటా నారు

నారుకు యమా డిమాండ్..!

ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. కిలో రూ.50 వరకు పలుకుతున్నాయి. దీంతో అన్నదాతలు టమోటా సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో నారుకు భారీ డిమాండ్ ఏర్పడింది. ముదిగుబ్బలోని నర్సరీల్లో నారు నిండుకుంది. మొన్నటి వరకు ఒక్కో టమోటా మొక్క నర్సరీలో 50 పైసలు పలుకుతుండేది. ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో ఏకంగా రూపాయితో రైతులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో నర్సరీల నిర్వాహకులకు లాభాల పంట పండుతోంది. కొందరు రైతులు.. నర్సరీలకు టమోటా విత్తనాలు ఇచ్చి, నార పోయించుకుంటున్నారు. మరికొందరు నర్సరీలోని మొక్కలను కొనుగోలు చేసి, నాటుతున్నారు. ఇటీవల అరకొరగా వర్షాలు కురవడంతో ఎండ వేడిమి కాస్త తగ్గింది. ఇది టమోటా సాగుకు అనుకూల వాతావరణమని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. దీంతో రైతన్నలు టమోటా సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

\- ముదిగుబ్బ

ప్రజా ఫిర్యాదులకు
పారదర్శక పరిష్కారం చూపాలి

పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టండి

జేసీ అభిషేక్ కుమార్



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న జేసీ

పుట్టపర్తి, సెప్టెంబరు 30: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు అందించే ఫిర్యాదులపై పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ (జేసీ) అభిషేక్ కుమార్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 247 అర్జీలు అందాయి. వాటిని జేసీ స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోగా పరిష్కంచాలన్నారు. మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని డీఆర్‌డీఏ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. పకడ్బందీగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డ్వామా పీడీ విజయప్రసాద్ పాల్గొన్నారు.

డీపీఓలో 57 ఫిర్యాదులు

పుట్టపర్తిరూరల్: జిల్లా కేంద్రంలోని డీపీఓలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు 57 అర్జీలు సమర్పించారు. వాటిని ఎస్పీ రత్న స్వీకరించారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలనీ, పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీ రత్న.. పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రైతు ఆత్మహత్యాయత్నం

పుట్టపర్తి, సెప్టెంబరు 30: వైసీపీ నాయకులు తన భూమిని కబ్జా చేశారనీ, అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం చేయడం లేదంటూ రైతు దస్తగిరి.. ఆత్మహత్యకు యత్నించాడు. స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ఒంటిపై పెట్రోలు పోసుకున్నాడు. ప్రధాన ద్వారం వద్ద తనిఖీలు చేసిన పోలీసులు.. దస్తగిరి వద్ద పెట్రోలు బాటిల్‌ను గుర్తించారు. ఆ వెంటనే దస్తగిరి ఒంటిపై పెట్రోలు పోసుకున్నాడు. పోలీసులు అడ్డుకుని, విషయం తెలుసుకున్నారు. బాధితుడు తెలిపిన మేరకు.. పుట్టపర్తి రూరల్ మండలం నిడిమామిడి పంచాయతీ పరిధిలోని దండువారిపల్లికి చెందిన దస్తగిరికి గ్రామ సర్వే నంబరు 122లో 38 సెంట్ల భూమి ఉంది. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు బాబా, మగ్బూల్ ఆక్రమించారు.



భూమిలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే దాడి చేశారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. దీంతో ఆత్మహత్య చేసుకునేందుకు కలెక్టరేట్ వద్దకు చేరుకున్నాడు. డీఆర్వో కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ అక్కడికి చేరుకుని బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఎస్పీ రత్న కలెక్టరేట్‌కు చేరుకుని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి నిఘా ఉంచాలని సూచించారు.

ఆశల తోట.. అప్పుల మూట..!

చేతిలో చిల్లిగవ్వ లేదు..
దొరికిన చోట..
అందినకాడ..
ఎడాపెడా అప్పులు తెచ్చి..
చీనీ పంట పెట్టాడు..
దానిపైనే ప్రాణాలు పెట్టుకున్నాడు..
త్వరలోనే పంట వస్తుంది..
కష్టాలు తీరుతాయని..
ఆశలు పెంచుకుంటూ పోయాడు..
లక్షలు ధారపోసి..
మందులు, ఎరువులు
ధారాళంగా పోశాడు..
చెట్లు ఏపుగా పెరిగాయి..
ఆశల ఐదో ఏడు రానేవచ్చింది..
పంట మాత్రం రాలేదు..
వచ్చే ఏడాది రాకపోతుందా
అని ఎదురుచూశాడు..
ఏడేళ్లయినా.. కాపు లేదు..
కంట నీరు ఆగలేదు..
ఆశల పంట...
అప్పుల దిగుబడినిచ్చింది..
అన్నదాత బతుకులో చీకట్లు నింపింది..
బిడ్డల్లా పెంచుకున్న చెట్లను
మరింత అప్పుతెచ్చి..
కూకటి వేళ్లతో పెకలించేస్తున్నాడు..
పాపం.. రైతు..



దిగుబడిలేని చీనీచెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం



జయరాములు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 30: మండలంలోని వేమారెడ్డిపల్లికి చెందిన రైతు కింకిరి జయరాములు సాగుచేసిన చీనీ తోటకు కాపులేక తొలగించేసుకున్నాడు. దిగుబడి లేకపోవడంతో చెట్లను సోమవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించేశాడు రైతు. జయరాములు మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ సమీపంలో ఏడేళ్ల క్రితం మూడు ఎకరాల్లో చీనీ పంట సాగుచేశాడు. సాగు సమయంలో మొక్కలు, ఇతర ఖర్చుల కోసం రూ.1.50లక్షలు వెచ్చించాడు. ఏటా పంటకు మందులు, ఎరువులకు రూ.లక్ష చొప్పున ఖర్చు చేస్తున్నాడు. ఐదేళ్లు గడిచాయి. ఇక పంట వదలాలి. దిగుబడి రాలేదు. ఆరోఏడూ అదే పరిస్థితి. ఏడో ఏడాది కూడా దిగుబడి రాలేదు. దీంతో చేసేదిలేక రైతు.. చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించేశాడు. దీంతో దాదాపు రూ.10లక్షల నష్టం వాటిల్లిందని రైతు జయరాములు వాపోయాడు. సర్వం కోల్పోయాననీ, అప్పుల పాలయ్యానని కన్నీటి పర్యంతమయ్యాడు.

బంగారం
దుకాణానికి కన్నం
బంగారు, వెండి నగల చోరీ

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 30: స్థానిక కదిరి-హిందూపురం ప్రధాన రహదారిలో ఉన్న పవిత్ర జ్యువెలర్స్ దుకాణంలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. షాపునకు కన్నం వేసి, రూ.19 లక్షల విలువచేసే 20 తులాల బంగారు, కిలో వెండి నగలను దొంగలు అపహరించారు. నల్లమాడ సీఐ నాగేంద్రరెడ్డి సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీరామాచారి పవిత్ర జ్యువెలర్స్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి షాపు బంద్ చేసుకుని, ఇంటికెళ్లాడు. ప్రధాన రహదారిలో ఉండడంతో ముందు నుంచి షాపులోకి చొరబడే అవకాశం లేదు. దీంతో దొంగలు షాపు వెనకాలే ఉన్న పశువైద్యశాల నుంచి స్కెచ్ వేశారు. అందులో భాగంగా పశువైద్యశాల భవన కిటికీ గ్రిల్ తొలగించి, లోపలికి చొరబడ్డారు. అక్కడి నుంచి పక్కనే ఉన్న బంగారు షాపు గోడకు కన్నం వేశారు. దాని గుండా షాపులోకి చొరబడ్డారు. అందులోని బంగారు, వెండి నగలను అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం దుకాణం తెరిచిన యజమాని.. అందులో పరిస్థితిని చూసి చోరీ అయినట్లు గ్రహించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పుట్టపర్తి డీఎస్పీ ప్రసాదరావు, నల్లమాడ సీఐ నాగేంద్రరెడ్డి.. సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. వేలిముద్రల నిపుణులు, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



దుకాణంలో పరిశీలిస్తున్న పోలీసులు



దొంగలు వేసిన కన్నం



పశువైద్యశాల కిటికీ గ్రిల్ తొలగించిన దృశ్యం

స్పందిద్దాం.. ప్రాణాలు నిలుపుదాం..

- రక్తదానంపై పెరుగుతున్న చైతన్యం
- మహోద్యమంలా నడిపిస్తున్న కొందరు
- పదే.. పదే.. రక్తం ఇస్తూ స్ఫూర్తి
- నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

అర్ధరాత్రి ప్రసవ వేదనతో..
ఆస్పత్రికి పరుగు పెడుతుంటారు..
వైద్యులు పరీక్షించి.. రక్తం ఎక్కించాలంటారు..
ఆ సమయంలో రక్తం ఇచ్చిన వ్యక్తి
రక్తదాత కాదు.. ప్రాణదాత..
తల్లీబిడ్డ ప్రాణాలు నిలిపిన మహాదాత..
ఆ కుటుంబాన్ని కాపాడిన ఇలవేల్పు..
ఈ పరిస్థితి కుటుంబీకులు, బంధువుల
రూపంలో.. ప్రతిఒక్కరికీ ఎదురై ఉంటుంది..
ఆ క్షణం రక్తం కోసం పరుగుపెడతారు..
రక్తం ఇచ్చిన వ్యక్తిని దైవసమానంగా చూస్తారు..
ఆ తర్వాత మరచిపోతుంటారు..
కొందరు మాత్రం మరువలేరు..
అలాంటి పరిస్థితిలో ఉన్న
మరొకరికి సాయం చేయాలనుకుంటారు..
వాళ్ల కష్టాన్ని తమ కష్టంగా భావిస్తారు..
ఆ క్షణంలో తామున్నామంటూ
అండగా నిలుస్తుంటారు..
రక్తం ఇచ్చి.. ప్రాణాలు నిలుపుతుంటారు..
వారే రక్తప్రదాతలు..
అపర విధాతలు..
నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన
దినోత్సవం సందర్భంగా అలాంటి
కొందరి గురించి తెలుసుకుందాం..

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 30: బీఎస్‌టీ బస్సు యజమాని విద్యాసాగర్ అంటే హిందూపురం ప్రాంతంలో తెలియని వారుండరు. ఉన్నత కుటుంబంలో జన్మించారు. ఉన్నత కుటుంబంలో జన్మించారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించనపుడు హిందూపురం మున్సిపల్ చైర్మన్‌గా గెలిచారు. అయినా.. ఆయనకు సమాజ సేవఅంటే ముందుంటారు. రక్తదాతగా ఎంతో పేరు గడించారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు ప్రారంభించినపుడు మొదట ఆరుగురు మిత్రులతో కలిసి రక్తదానం చేశారు. అప్పట్నుంచి రక్తదానం చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం ఆయన వయసు 70 ఏళ్లు. నేటికీ రక్తదానం చేస్తూనే ఉన్నారు. అలా.. ఇప్పటివరకు 61 సార్లు రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న విద్యాసాగర్



రక్తదానం చేస్తున్న హెచ్ఎన్ రాము

ఇందుకుఆగాను 1992లో ముంబై తాజ్ హోటల్‌లో అప్పటి కేంద్ర మంత్రి సుబ్రహ్మణ్యస్వామి నుంచి లోకశ్రీ అవార్డు అందుకున్నారు. తరువాత 2023లో తమిళనాడులోని హోసూరులో రక్తదాతగా, ఉత్తమ సామాజివేత్తగా డాక్టరేట్ అందుకున్నారు. ఉన్నత కుటుంబంలో పుట్టినా, విలాసవంత జీవితం అనుభవించే అవకాశం ఉన్నా.. ఆయన సమాజసేవ చేయడం, అందునా అన్నిసార్లు రక్తదానం చేయడం ప్రశంసనీయం.

ఎన్టీఆర్ చూపిన మార్గంలో..

టీడీపీ వ్యవస్థాపకుడు రామారావు చూపిన మార్గమే తనకు అనుసరణీయమంటున్నారు హిందూపురం మండలం కిరికెర మాజీ సర్పంచ్ హెచ్ ఎన్ రాము. ప్రస్తుతం ఈయన వయసు 50 సంవత్సరాలు. 53 సార్లు రక్తదానం చేశారు. ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి, బాలయ్య పుట్టినరోజు, ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం చేస్తుంటారు. ఎన్టీఆర్ రక్తదాన ట్రస్టు నుంచి అవార్డు కూడా అందుకున్నారు.

ఏకంగా ట్రస్టే ఏర్పాటు చేశారు..



ధర్మవరం: పట్టణానికి చెందిన కన్నా వెంకటేశ్‌కు రక్తదాతగా పేరుంది. తొలుత తలసేమియా చిన్నారికి రక్తం ఇచ్చారు. ఆ వ్యాధి గురించి తెలుసుకున్నారు. ఆ వ్యాధి బారిన పడినవారికి 15 రోజులకోసారి రక్తం ఇవ్వకుంటే చనిపోతారని వైద్యులు తెలిపారు. దీంతో అలాంటి వారి ప్రాణాలు కాపాడాలనుకున్నారు. ఆ దిశగా 2016లో రక్తబంధం ట్రస్టు ఏర్పాటు చేశారు. ధర్మవరంలో 16 మంది, అనంతపురంలో 14 మంది సభ్యులుగా ఉన్నారు. ట్రస్టు ద్వారా ఇప్పటివరకు 4వేలమందికి పైగా రక్తదానం చేసినట్లు వెంకటేశ్ తెలిపారు.

పురం మహిళా కానిస్టేబుల్‌కు పతకం



హిందూపురం, సెప్టెంబరు 30: అఖిల భారత పోలీసు క్రీడాపోటీల్లో హిందూపురం అప్‌గ్రేడ్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ మంజమ్మ ప్రతిభ కనబరిచారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాయ్ పట్టణంలో గతనెల 23నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో రాష్ట్రం తరఫున మంజమ్మ పాల్గొన్నారు. యోగాలో కాంస్య పతకం సాధించారు. రాష్ట్ర జట్టును సోమవారం డీజీపీ ద్వారకా తిరుమల రావు తన కార్యాలయంలో అభినందించారు. జిల్లా ఎస్పీ రత్న.. కానిస్టేబుల్ మంజమ్మను అభినందించారు.

లక్షల్లో కమీషన్..!

జిల్లా విద్యాశాఖలో రూ.కోట్లలో అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిన్నటి వరకూ గత ఏడాది ఎఫ్ఏ-3 పరీక్షల్లో అక్రమాలు మాత్రమే చూశాం. ఇప్పుడు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్షల వ్యవహారాలు చూస్తే రూ.2.5కోట్ల పనుల్లో భారీగానే అక్రమాలు జరిగినట్లు తెలిసింది. సాధారణంగా ప్రభుత్వ పనులకు రూ.లక్ష దాటితే టెండర్ పిలుస్తారు. కానీ రూ.2.5 కోట్ల వ్యవహారంలో టెండర్లు పిలవకుండా గోల్‌మాల్ వ్యవహారంతో రూ.లక్షల కమీషన్లు పుచ్చుకుని పనులు కట్టబెట్టినట్లు సమాచారం.

- రూ. 2.5 కోట్ల పనులకు రూ. 25 లక్షల కమీషన్
- 2024-25 పరీక్ష పేపర్ల ముద్రణలో తతంగం
- టెండర్లు లేకుండా విజయవాడ ప్రాంత ప్రింటర్స్‌కు..
- డీసీఈబీ, విద్యాశాఖ అధికారుల మాయాజాలం
- డీసీఈబీలో వరుస అక్రమాలు
- చోద్యంచూస్తున్న జిల్లా ఉన్నతాధికారులు
- విజిలెన్స్ విచారణ జరిగితే అక్రమాలు బయటకు..


డీసీఈబీ కార్యాలయం


జిల్లా విద్యాశాఖ కార్యాలయం

అనంతపురం విద్య, సెప్టెంబరు 30: జిల్లా విద్యాశాఖలోని డీసీఈబీ కేంద్రంగా అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. 2023-2024 విద్యాసంవత్సరంలో ఎఫ్ఏ-ప్రశ్నపత్రాల ముద్రణ, సరఫరాలో అక్రమాలు జరిగాయి. తాజాగా 2024-2025 విద్యా ఏడాదికి సంబంధించి ఆరు రకాల పరీక్షలకు ప్రశ్నపత్రాల ముద్రణ, సరఫరా వెనుక భారీగా అక్రమాలకు బీజంపడినట్లు సమాచారం. సుమారు రూ. 2.50 కోట్ల విలువైన ఈ పనుల్లో కొందరు అధికారులు అత్యాశతో విజయవాడ కేంద్రంగా నడిచే ప్రింటర్స్‌కు గంప గుత్తగా పనులు అప్పజెప్పి రూ.20 లక్షల నుంచి రూ. 25 లక్షలు మామూళ్లు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. గత రెండేళ్లలో కోట్ల రూపాయల విలువైన పనుల్లో భారీగా కుంభకోణాలు జరిగినట్లు తెలుస్తోంది. వీటిపై విజిలెన్స్ దృష్టి సారిస్తే ప్రభుత్వ సొమ్ము దోచేసిన అక్రమార్కుల బాగోతాలు బయటపడే అవకాశం ఉంది. ఫేక్ ఉత్తర్వులిచ్చిన అధికారులు కటకటాలపాలయ్యే అవకాశమూ ఉంది.

పరీక్ష నిధులపై కన్నేసి...

ఏడాదిలో రెండు రకాల పరీక్షలు జరుగుతాయి. అందులో ఫార్మేటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ) 4 సార్లు, సమ్మేటివ్ అసెస్మెంట్ (ఎస్ఏ) పరీక్షలు 2 సార్లు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యారంగాలో సుమారు 4 లక్షల మంది విద్యార్థులున్నారు. ప్రభుత్వ రంగంలోని స్కూళ్లలో చదివే విద్యార్థుల ప్రశ్నపత్రాలకయ్యే ఖర్చును ప్రభుత్వం తరపున ఎస్‌సీఈఆర్టీ భరిస్తుంది. అదే ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థుల ప్రశ్నపత్రాలకయ్యే ఖర్చును ప్రైవేట్ స్కూళ్ల నుంచే డీసీఈబీ వసూలు చేస్తుంది. ఈ ఫీజు వసూలు ఒక్కో ఏడాది ఒక్కో రకంగా ఉంటుంది. ఇలా రెండు వైపుల నుంచి వచ్చిన నిధుల ద్వారా ప్రశ్నపత్రాలు ముద్రించి, స్కూళ్లకు సరఫరా చేస్తారు. ఈ తతంగమంతా విద్యాశాఖ పరిధిలోని డీసీఈబీ ద్వారా జరుగుతుంది. ఈ ప్రశ్నపత్రాల ముద్రణ, సరఫరా పనుల కేటాయింపులో పెద్ద గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ తంతు భారీగా నడిచింది. కొందరు అధికారులు లక్షలాది రూపాయలు మామూళ్లగా దండుకోడానికి అడ్డగోలుగా టెండర్ వ్యవహారం చుట్టూ గారడీ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

కమిటీ సభ్యులతో చర్చలే లేవు

డీసీఈబీలో ఉన్నతాధికారులతోపాటు పలువురు హెచ్ఎంలు, ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్లు కూడా సభ్యులుగా ఉంటారు. ముఖ్యంగా డీఈఓ, డీసీఈబీ సెక్రెటరీ, ఏసీ, డిప్యూటీ డీఈఓలు, పలు యాజమాన్య స్కూళ్ల నుంచి ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ స్కూళ్ల యూనియన్ నేతలు ఇలా సుమారు 10 మంది సభ్యులు ఉంటారు. డీసీఈబీలో ప్రశ్నపత్రాల ముద్రణ, సరఫరా విషయంతోపాటు, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజు నిర్ణయంపై కూడా కమిటీలో చర్చించాల్సి ఉంటుంది. ప్రైవేట్ స్కూళ్ల నుంచి రూ.150, రూ. 200 లేదా రూ. 250 ఇలా ఎంత ఫీజు వసూలు చేయాలో కూడా చర్చించి నిర్ణయం తీసుకుంటారు. తూతూమంత్రంగా కమిటీ సమావేశం పెట్టి ముగించేస్తున్నారు. తెర వెనుక రూ.కోట్ల విలువైన వర్కులను మాత్రం గంపగుత్తగా కోస్తా ప్రాంతంలోని కొన్ని ముద్రణాలయాలకు కట్టబెట్టి భారీగా లబ్ధిపొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అయితే భారీగా అక్రమాలు చేసిన అధికారులు విచారణలు తప్పించుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే కొందరు అధికారులు బదిలీ ప్రయత్నాలు కూడా చేస్తున్నట్లు సమాచారం. దీనిపై డీఈఓను వివరణ కోరడానికి 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

గంపగుత్తగా పనులు...

జిల్లా విద్యాశాఖలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఆరు పరీక్షల ప్రశ్నపత్రాల ముద్రణ, సరఫరా పనుల వెనుక అక్రమాలు భారీగానే జరిగాయన్న విమర్శలు ఉన్నాయి. టెండర్ విషయంలో మాయాజాలం సృష్టించి విజయవాడ ప్రాంతంలోని కొన్ని ముద్రణాలయాలకు గంపగుత్తగా పనులు అప్పజెప్పినట్లు తెలిసింది. సుమారు రూ.2.5 కోట్ల విలువైన పనుల విషయంలో పారదర్శకంగా టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అయితే పారదర్శకతకు పాతరేసి, ఎస్‌సీఈఆర్టీని కొందరు పెద్దలు, డీసీఈబీ, డీఈఓ ఆఫీస్‌లోని కొందరు ఉన్నతాధికారులు తమకు అయినవాళ్లకు ఈ వర్కులు కట్టబెట్టారని సమాచారం. ఇలా గంపగుత్త పనులకు కట్టబెట్టినందుకు కొందరు ఉన్నతాధికారులకు 10 శాతం నుంచి 15 శాతం వరకూ కమీషన్లు పుచ్చుకున్నారనే టాక్ నడుస్తోంది.

3 నుంచి టెట్

- జిల్లా నుంచి 44,855 మంది అభ్యర్థులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 30: ఏపీటెట్ జూలై-2024 ఈ నెల 3 నుంచి 21 వరకూ నిర్వహిస్తున్నట్లు డీఈఓ వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా నుంచి 44855 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. నిర్దీత తేదీల్లో రెండు విడతల్లో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకూ మధ్యాహ్నం 2:30గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. అనంతపురం నగరంలో ఆరు కేంద్రాలు, తాడిపత్రిలో రెండు కేంద్రాలు, గుత్తిలో ఒకటి, బెంగళూరులో మూడు కేంద్రాల్లో పరీక్షలుంటాయన్నారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, వైద్య సేవలు ఇతర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించమన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్లు, గుర్తింపు కార్డుతోపాటు గంటన్నర ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షకేంద్రాల వివరాలను http://deoananthapuramu.blogspot.com వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునన్నారు.

టమోటా కిలో రూ.48

అనంతపురంరూరల్, సెప్టెంబరు 30: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.48తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 900 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.38, కనిష్ఠ ధర రూ.30 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.18వేలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 30: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 10టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సార్..! ఇది మీరే..

- జిల్లా కలెక్టర్ చిత్రాన్ని పెన్సిల్‌తో గీసిన బాలిక


కలెక్టర్‌కు చిత్రపటాన్ని అందిస్తున్న విద్యార్థిని నవ్యశ్రీ

రాయదుర్గం, సెప్టెంబరు 30: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పి. నవ్యశ్రీ పెన్సిల్‌తో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ చిత్రపటాన్ని గీసింది. ఆ చిత్రపటాన్ని సోమవారం అనంతపురం ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్‌లో ఉన్న డీఆర్‌డీఏ, వెలుగు కార్యాలయంలోని పీడీ చాంబర్‌లో కలెక్టర్‌కు అందజేసింది. తన చిత్రపటాన్ని చూసుకుని కలెక్టర్ బాలికను అభినందించారు. బాలిక మాట్లాడుతూ పెన్సిల్‌తో బొమ్మలు గీయడం నేర్చుకుంటున్నానని, ఈక్రమంలోనే జిల్లా కలెక్టర్ చిత్రపటాన్ని గీసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, పాఠశాల హెచ్ఎం జయప్రద, టీచర్ భాగ్యలక్ష్మి, బాలిక తండ్రి నరసింహులు, తల్లి వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కోటి విరాళం


సీఎంను సన్మానించిన అర్జాస్ స్టీల్‌ప్లాంట్ ఎండీ

తాడిపత్రి, సెప్టెంబరు 30: ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల్లో నష్టపోయిన వారిని ఆదుకోవడం కోసం తనవంతుగా తాడిపత్రి అర్జాస్ స్టీల్ ప్లాంట్ ముందుకు వచ్చింది. ఈమేరకు అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడుకు అర్జాస్‌స్టీల్ ప్లాంట్ ఎండీ శ్రీధర్‌కృష్ణమూర్తి కోటి రూపాయల విలువగల చెక్కును సోమవారం అందించినట్లు ప్లాంట్ ఉద్యోగి సత్య తెలిపారు.

3 నుంచి దసరా ఉత్సవాలు

కదిరి, సెప్టెంబరు 30: కదిరి పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నుంచి దేవీనవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 3న మత్స్యావతారం, 4న కూర్మావతారం, 5న నృసింహావతారం, 6న రామావతారం, 7న శ్రీకృష్ణావతారం, 8న పరమపదనాథ అలంకారము, 9న శ్రీసరస్వతి, 10న మోహిని అలంకారము, 11న వెంకటేశ్వ అలంకారముతో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. 12న మధ్యాహ్నం 2గంటలకు స్వామివారి ఆలయం నుంచి ఊరేగింపుగా రాయచోటి రోడ్డు వద్ద ఉన్న దసరా మండపం వద్దకు విచ్చేస్తారన్నారు. తదుపరి శమీపూజ ఆస్థాన పూజలనంతరం స్వామివారు అశ్వవాహనంపై గ్రామోత్సవంతో ఆలయానికి విచ్చేస్తారన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు


కావ్యాంజలి

గార్లదిన్నె, సెప్టెంబరు 30: మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన వివాహిత ఎరుకుల కావ్యాంజలి కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ఎరుకుల మల్లమ్మ, సతీష్ దంపతులు కుమార్తె కావ్యాంజలికి ఏడాది కిందట కళ్యాణదుర్గం మండలం సీబాయి గ్రామానికి చెందిన ఎరుకుల వన్నూరుస్వామితో వివాహం జరిగింది. అయితే వివాహమైన మూడు నెలలకే దంపతుల మధ్య గొడవ జరగడంతో కావ్యాంజలి పుట్టింటికి వచ్చింది. అప్పటి నుంచి తల్లిదండ్రుల వద్దే ఉండేది. నాలుగు నెలలు నుంచి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తుండేది. ఈనెల 26న మధ్యాహ్నం నుంచి కావ్యాంజలి కనిపించకపోవడంతో బంధువులతోను తెలిసిన వారితో ఆమె తల్లిదండ్రులు ఆరా తీశారు. అయినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్య


నాగేంద్ర

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 30: మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర(39) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. నాగేంద్రకు మూడు ఎకరాల పొలం ఉంది. అందులో వేరుశనగ, వరి సాగు చేసేవాడు. పంట పెట్టుబడి, బోరు బావుల కోసం రూ.ఏడు లక్షలకు పైగా అప్పు చేశాడు. పంట గిట్టుబాటు కాకపోవడంతో అప్పు తీర్చలేనేమోనని తీవ్రంగా ఆందోళన చెందాడు. ఈ క్రమంలో ఆదివారం తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాప్తాడు, సెప్టెంబరు 30: మండలంలోని రాప్తాడు రైల్వేగేటు సమీపాన గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు ధర్మవరం రైల్వే ఎస్‌హెచ్ఓ షణ్ముకానందరెడ్డి తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి సోమవారం తెల్లవారుజామున రైలు కింద పడి మరణించాడన్నారు. రైలు పట్టాలపై మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు ధర్మవరం రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు దాదాపు 28 సంవత్సరాలు ఉండవచ్చన్నారు. మృతుడి వివరాలు తెలియలేదన్నారు. మృతదేహ భాగాలను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఐస్ ఫ్రిడ్జ్‌లో ఉంచామన్నారు. మృతుడి బంధువులు ఎవరైనా వస్తే మంగళవారం పోస్టుమార్టం చేస్తామన్నారు. వివరాలకు 9440557054 (షణ్ముకానందరెడ్డి, రైల్వే స్టేషన్ హౌస్ ఆఫీసర్) సంప్రదించాలన్నారు.

మంత్రి పేరు చెప్పి నిర్మాణాల కూల్చివేత

అడ్డుకున్న ప్లంబర్స్ అసోసియేషన్ నాయకులు
రూ.50 లక్షలు డిమాండ్ చేశారని ఆవేదన
బీజేపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు


ఎక్స్‌కవేటర్‌తో బేస్‌మెంట్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

ధర్మవరం, సెప్టెంబరు 30: పట్టణంలో పలువురు బీజేపీ నాయకులు సోమవారం దౌర్జన్యానికి దిగారు. మంత్రి సత్యకుమార్ పేరు చెప్పి ప్లంబర్స్ నిర్మించుకుంటున్న ఇళ్ల గోడలను యంత్రాలతో కూల్చివేశారు. విషయం తెలుసుకున్న ప్లంబర్స్ అక్కడికి చేరుకుని నిలువరించడానికి ప్రయత్నించారు. బీజేపీ నాయకులు గొడుగు నాగరాజు, సోము, బాలకృష్ణ యాదవ్ ఆ స్థలాలు తమవని అనడంతో ఇరువర్గాల మధ్య తోపులాల జరిగింది. పట్టణంలోని 650-2 సర్వే నంబరులో ఉన్న స్థలాలపై దాదాపు 15 సంవత్సరాలుగా వివాదం నడుస్తోంది. దీనిపై కోర్టును ఆశ్రయించడంతో 2023లో ప్లంబర్స్ అసోషియేషన్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో నాటి వైసీపీ ప్రభుత్వం పట్టాలను పంపిణీ చేసింది. ఇందులో అర్హులతో పాటు వైసీపీకి చెందిన కొందరు విలువైన స్థలాలను దక్కించుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే అర్హులు, అనర్హులను గుర్తించాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈలోగా బీజేపీ ముసుగులో కొందరు ప్లంబర్స్ నిర్మించుకుంటున్న ఇళ్లను భారీ యంత్రాలతో కూల్చివేశారు. ప్లంబర్స్ అసోషియేషన్‌కు టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి మద్దతుగా నిలిచారు. బీజేపీ ముసుగులో వచ్చిన నాయకులలో సోము అనే వ్యక్తిని వారు వన్‌టౌన్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. నిర్మాణాల కూల్చివేతతో రూ.15 లక్షలు నష్టం జరిగిందని ప్లంబర్స్ అసోషియేషన్ నాయకులు అన్నారు. టీడీపీ నాయకులు తమకు అండగా నిలబడకపోతే మరింత నష్టం జరిగేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి సత్యకుమార్ పేరు చెప్పి రూ.50 లక్షలతో పాటు 15 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారని, ఇవ్వనందుకే కూల్చివేశారని ఆరోపించారు. గొడుగు నాగరాజు, సోము, బాలకృష్ణ యాదవ్ తమ నిర్మాణాలను కూల్చివేయించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.


బీజేపీ నేతలతో ప్లంబర్స్ అసోసియేషన్ నాయకుల వాగ్వాదం

తగ్గిన సబ్సిడీ

- పప్పుశనగ ధర ఖరారు
- క్వింటా ధర రూ.9400
- 25 శాతం సబ్సిడీ వర్తింపు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 30: ఎట్టకేలకు పప్పుశనగ సబ్సిడీ ధర ఖరారు చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పప్పుశనగ జేజీ-11 రకం క్వింటా పూర్తి ధర రూ.9400లుగా నిర్ణయించారు. ఇందులో 25 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. రైతు వాటా కింద క్వింటా పప్పుశనగకు రూ.7050 లు చెల్లించాల్సి ఉంటుంది. అర ఎకరాకు ఒక ప్యాకెట్(20 కేజీలు), ఎకరాకు 2, 1.5 ఎకరాకు 3, రెండెకరాలకు 4, 2.5 ఎకరాలకు 5, మూడెకరాలకు 6, 3.5 ఎకరాలకు ఏడు, 4 ఎకరాలకు 8, 4.5 ఎకరాలకు 9 ప్యాకెట్లు, 5 ఎకరాలకు 10 ప్యాకెట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

తగ్గిన సబ్సిడీ... రైతులపై అదనపు భారం

గతేడాదితో పోలిస్తే ఈ సారి సబ్సిడీ ధరను తగ్గించారు. గతేడాది పప్పుశనగ క్వింటా పూర్తి ధర రూ.8100లు ఉండింది. ఇందులో 40 శాతం సబ్సిడీ రూ.3240లుపోను రైతు వాటా మొత్తం రూ.4860 చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. రెండేళ్ల కిందట 25 శాతం సబ్సిడీ ఉండేది. గతేడాది సబ్సిడీని 45 శాతానికి పెంచారు. ఈ సారి తిరిగి 25 శాతానికి తగ్గించారు. ఈ సారి పప్పుశనగ పూర్తి ధరను గతంతో పోలిస్తే పెంచడంతో పాటు సబ్సిడీని తగ్గించడంతో కరువు జిల్లా రైతులపై అదనపు భారం పడింది.

నేడే కొత్త మద్యం పాలసీ నోటిఫికేషన్

- నేటి నుంచి 9 దాకా దరఖాస్తుల స్వీకరణ
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 30: నూతన మద్యం పాలసీకి సంబంధించి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం మంగళవారం విడుదల చేయనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సోమవారం తెలిపారు. స్థానిక ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, ఏఈఎస్‌లు శ్రీరామ్, రేవతిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతపురం జిల్లాలో 136 మద్యం షాపులు, శ్రీసత్యసాయి జిల్లాలో 87 ప్రైవేటు మద్యం షాపుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు మద్యం షాపుల నిర్వహణ కోసం మంగళవారం నుంచి అక్టోబరు 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆన్‌లైన్ పద్ధతితోపాటు మాన్యువల్‌గా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జిల్లాలోని 10 ఎక్సైజ్ స్టేషన్లు, శ్రీసత్యసాయి జిల్లాలోని 8 స్టేషన్లల్లో మాన్యువల్‌గా దరఖాస్తులు తీసుకుంటారన్నారు. ప్రతి స్టేషన్‌లో ఒక డిజిటల్ టెక్నీషియన్, బ్యాంక్ సిబ్బంది ఉంటారన్నారు. అక్టోబరు 11న లాటరీ పద్ధతిలో ప్రైవేటు మద్యం షాపులను కేటాయిస్తామన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా నిర్ణయించారని, ఈ మొత్తం నాన్ రిఫండబుల్ అన్నారు. లైసెన్స్ ఫీజు ప్రాంతాల వారిగా ఎంత చెల్లించాలి..? ఇతర వివరాలు నోటిఫికేషన్ విడుదల తర్వాత మంగళవారం ప్రకటస్తామన్నారు.

వృద్ధుల్ని ముంచిన మేనల్లుడు

డబ్బు, నాలుగెకరాల భూమి కాజేసిన వైనం
రెవెన్యూ అధికారులకు వృద్ధ దంపతుల ఫిర్యాదు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 30: సొంత అన్న కొడుకు, మేనల్లుడు కదా అని నమ్మితే నట్టేట ముంచేశాడని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వద్ద ఉన్న రికార్డులతో పాటు రూ. 50వేలు ఇచ్చి తన పేరు మీద పట్టాదారు పాసుపుస్తకాలు చేయించమని చెబితే భూమినే కాజేశాడని వారు సోమవారం బొమ్మనహాళ్ రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన నరసమ్మ, ముసలప్ప వృద్ధ దంపతులు కొన్నేళ్లుగా కొళగానహళ్లి గ్రామ పొలంలో 147 సర్వే నంబర్‌లో ఆరు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నారు. ఏడేళ్ల క్రితం కృష్ణాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు(నరసమ్మ అన్న కొడుకు)ను నమ్మి రూ. 50 వేల నగదు, సాగులో ఉన్న భూమికి సంబంధించిన రికార్డులు ఇచ్చి తన పేరుపై పట్టదారు పాసుపుస్తకం చేయించి ఇవ్వాలని కోరారు. ఆయన అదిగో ఇదిగో అంటూ కొన్నేళ్లుగా తిప్పించుకున్నాడు. దీంతో విసుగు చెందిన వారు కొన్ని రోజుల కిందట రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి పాసుపుస్తకాలను చేయించాలని కోరారు. వారు పరిశీలించి ఇందులో అచ్చెమ్మ పేరుపై నాలుగు ఎకరాల భూమి రికార్డు అయినట్లు తెలిపారు. తాము నమ్మిన ఆంజనేయులు తన భార్య పేరుపై నాలుగు ఎకరాల భూమికి పట్టా పాసుపుస్తకాలు చేయించుకుని బ్యాంకులో రుణం కూడా పొందినట్లు తెలుసుకున్నారు. దీంతో ఆ వృద్ధ దంపతులు పెద్ద మనుషులతో పంచాయతీ పెట్టారు. బ్యాంకులో ఉండే రూ.2 లక్షల అప్పు కడితే రెండెకరాలు మీ పేరుపై చేసి ఇస్తానని ఆంజనేయులు చెబుతున్నాడని ఆ వృద్ధ దంపతులు వాపోయారు. కొందరు పెద్ద మనుషులు కూడా అతడివైపే మాట్లాడుతున్నారని, మీరైనా న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఇప్పటికీ ఆరు ఎకరాల భూమిలో తామే సాగులో ఉన్నామని, తమకు పట్టాదారు పాసుపుస్తకాలు చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందించారు.


రికార్డు చూపిస్తున్న వృద్ధదంపతులు

ఉత్తమ గ్రామీణ ఇంక్యుబేటర్‌గా ఎస్కేయూ



అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ నాగభూషణరాజు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 30: ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఉత్తమ గ్రామీణ ఇంక్యుబేటర్‌గా నిలిచిందని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత సోమవారం తెలిపారు. స్టార్టప్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్స్, ఇండస్ట్రీస్ అభివృద్ధిని ప్రోత్సహించేలా ఈనెల 28, 29న హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్(ఐఎఫ్ఎస్) నిర్వహించారన్నారు. ఈ వేడుకల్లో ఎస్కేయూ ఉత్తమ గ్రామీణ ఇంక్యుబేటర్ అవార్డుకు ఎంపికైందని తెలిపారు. బలమైన దేశీయ స్టార్టప్ వ్యవస్థ నిర్మాణం, గ్రామీణ సాంకేతిక, సుస్థిర అభివృద్ధివైపు ప్రజలను ప్రోత్సహించినందుకు ఈ అవార్డు దక్కిందని పేర్కొన్నారు. అపోలో హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ గీతారెడ్డి చేతులమీదుగా ఇంక్యుబేషన్ సెంటర్ డైరెక్టర్ నాగభూషణరాజు అవార్డును అందుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇంక్యుబేషన్ సెంటర్ అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమని ప్రశంసించారు.

ఎక్సైజ్ శాఖలో బదిలీలు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 30: జిల్లాలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో పలువురు సీఐలు, ఎస్ఐలు బదిలీ అయ్యారు. అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలుగా అలీ, లక్ష్మీసుహాసిని, సునంద, అన్నపూర్ణ నియమితులయ్యారు. అనంతపురం ఐఎంఎల్ డిపో సీఐగా మురళీమోహన్, డొనేకల్లు చెక్ పోస్టు సీఐలుగా సోమశేఖర్, శ్రీరాములు, విడపనకల్లు చెక్ పోస్టు సీఐలుగా గురుప్రసాద్, రవి, ఓబుళాపురం చెక్ పోస్టు సీఐలుగా మారుతీరావ్, మునిస్వామి, ఉరవకొండ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సీఐలుగా కవిత, మోహన్ నరసింహ, కళ్యాణదుర్గం మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సీఐలుగా మహబూబ్ బాషా, సునీల్‌కుమార్‌ను బదిలీ చేశారు. పలువురు ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. వీరిలో సోమవారం పలువురు బాధ్యతలు స్వీకరించారు. మిగిలిన అధికారులు, ఒకటి, రెండు రోజుల్లో కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరిస్తారు.

ఎక్సైజ్ స్టేషన్	సీఐ
అనంతపురం	సత్యనారాయణ
బుక్కరాయసముద్రం	నాగసునీత రాణి
గుత్తి	ఉమాదేవి
గుంతకల్లు	శివసాగర్
తాడిపత్రి	నాయుడు
ఉరవకొండ	రవిచంద్ర
కణేకల్లు	ఉమాబాయి
రాయదుర్గం	గణేష్
కళ్యాణదుర్గం	హసీనా బాను
కంబదూరు	ఎస్ఎం రఫి

నేడు పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 30: జిల్లాలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రారంభమౌతుంది. మొత్తం 2,85,933 మంది లబ్ధిదారులకు రూ.125.37 కోట్లు పంపిణీ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 663 గ్రామ-వార్డు సచివాలయాలు, 31 మండలాలు, ఆరు మున్సిపాలిటీలలో 5590 మంది సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదు అందజేస్తారు. డీఆర్‌డీఏ-వెలుగు అధికారులు 41మంది పర్యవేక్షిస్తారు.

రైళ్ల దారి మళ్లింపు

గుంతకల్లు, సెప్టెంబరు30: హుబ్లీ డివిజన్‌లో జరుగుతున్న ట్రాక్ పనుల కారణంగా నాలుగు రైళ్లను గుంతకల్లు డివిజన్ మీదుగా మళ్లించినట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హుబ్లీ-హైదరాబాద్ (నెం. 17319) రైలును అక్టోబరు 1న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 17320)ను అక్టోబరు 1, 2న గదగ్, బళ్లారి, గుంతకల్లు బైపాస్, రాయచూరు, వాడి స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు. అలాగే సాయినగర్ షిర్డీ-మైసూరు ఎక్స్‌ప్రెస్ (నెం. 16218)ను వాడి, గుంతకల్లు, బళ్లారి స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా ...

ఓటు హక్కు వినియోగించుకోండి

నల్లమాడ , సెప్టెంబరు 30: స్థానిక వ్యవసాయ సహకార సంఘం సభ్యత్వమున్న రైతులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి పేరు నమోదు చేసుకోవాలని సీఈఓ కేశవులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సహకారం సంఘంలో ఖాతాలున్న రైతులు ఆధార్, రేషన్, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌ఫొటోలు అందించాలన్నారు. వాటితో ఆన్‌లైన్ చేయించుకుంటేనే ఓటు హక్కులు ఉంటుందన్నారు.

వసతి గృహం తనిఖీ

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 30 : మండలంలోని వడ్డివారిపల్లి వద్ద ఉన్న ఎస్సీ ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహాన్ని సోషియల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శివరంగ ప్రసాద్, డీపీఎం కుళ్లాయప్పనాయక్ సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. వారి వెంట ఏఎస్‌డబ్ల్యూఓ రెడ్డిబాలాజీ, హెచ్‌డబ్ల్యూఓ రవీంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు

మండల సమాఖ్య వార్షికోత్సవం

నల్లచెరువు, సెప్టెంబరు 30: శ్రీఆంజనేయస్వామి మండల సమాఖ్య 21 వార్షికోత్సవాన్ని సోమవారం వెలుగు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఎంఎస్ అధ్యక్షురాలుగా పి. గంగాదేవమ్మ, కార్యదర్శిగా మౌనిక, కోశాధికారిగా సి. రమణమ్మ, ఉపకార్యదర్శి గా లక్ష్మీదేవి, ఉపాధ్యక్షురాలిగా ముంతాజ్‌ను ఎన్నుకున్నారు. ఏపీఎం రామయ్య 2023-24 నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు, సీసీలు కదిరప్ప, మునెప్ప, మీటేనాయక్, వేణుగోపాల్ హనుమంతు, సుగుణమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

నంబులపూలకుంట, సెప్టెంబరు 30: ఉద్యోగ ఉపాధ్యాయులకు ఈఎఫ్, ఏపీజీఎల్ఐ, ఫైనల్ పేమెంట్, ఆర్జిత సెలవుల నగదు చాలా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమయానికి రావలసిన బకాయిలు అందకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు రామాంజులయాదవ్, జిల్లా కౌన్సిలర్ రమణనాయక్, శివయ్య, మురళి, సందీప్, గోవర్ధన్‌రెడ్డి, రహీమ్, వెంకటరమణారెడ్డి, రామమోహన్, లాలూసాబ్, షఫీ పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

నంబులపూలకుంట, సెప్టెంబరు 30: తమ గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే దాన్ని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని తాటిమానుగుంత గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ మనోహర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ఒక కొళాయిలోనే నీరు వస్తోందని, ఒక బిందెనీటి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని వాపోయారు. రాత్రింబవళ్లు కొళాయి వద్ద వేచి ఉండాల్సి వస్తోందన్నారు రక్షిత మంచి నీటి బోరులో గతంలో పైపులు అదనంగా ఉండేవని, నీరు పుష్కలంగా ఉండే సమయంలో అమర్చిన పైపులను తీసుకెళ్లి మరోచోట ఏర్పాటు చేయడంతో ఈ సమస్య నెలకుందని వాపోయారు. బోరును శుభ్రం చేస్తే కనీసం గ్రామానికి నీటి సమస్య కొంతవరకు తీరుతుందన్నారు. స్పందించిన ఎంపీడీఓ వెంటనే సమస్యను పరిష్కరించాలని కార్యదర్శి తాసీన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, గంగయ్య, మల్లికార్జున, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ముదిగుబ్బ, సెప్టెంబరు 30 : గోరంట్ల మండలం దిగువ గంగంపల్లి తండాలో పిడుగుపాటుకు దేవి భాయ్, దసరత్‌నాయక్ దంపతులు మరణించిన విషయం తెల్సిందే. టీడీపీ హిందూపురం పార్లమెంట్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ హేమలతా భాయ్, హిందూపురం తెలుగు యువత కార్యదర్శి వడిత్య కుల్లాయి నాయక్ ఆ గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారికి రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.



విద్యార్థులకు ఆటవస్తువులు అందిస్తున్న న్యాయాధికారి రాకేష్

బుద్ధిమాంద్య పిల్లలకు ఆటవస్తువుల అందజేత

పుట్టపర్తి, సెప్టెంబరు 30: స్థానిక బుద్ధిమాంద్య పిల్లల పాఠశాలను పుట్టపర్తి జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్ సోమవారం పరిశీలించారు. రూ. 40 వేల విలువ చేసే ఆట వస్తువులు, స్టేషనరీని పిల్లలకు అందజేశారు. బుద్ధిమాంద్య పిల్లలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆ విద్యార్థులతో కొంత సేపు ముచ్చటించారు. ఉపాధ్యాయులకు చీరలు పంపిణీ చేశారు. ఆయన వెంట కోర్టు సూపరింటెండెంట్ బాలాజీ నాయక్, సిబ్బంది మంజునాథ్, అశ్వర్థనారాయణ, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన సదస్సు

బుక్కపట్నం, సెప్టెంబరు 30: స్థానిక ఎస్సీ కాలనీలోని రామాలయంలో పౌరహక్కులపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ క్రిష్ణమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, వీఆర్‌ఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలోని మాల్యవంతంలో దళితుల కాలనీలో సోమవారం పౌరహక్కులపై అవగాహన సదస్సు నిర్వహిచారు. ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీడీఓ సాయిమనోహర్ చట్టాలపై అవగాహన కల్పించారు.

నల్లమాడ : మండలంలోని అరవాండ్లపల్లి తండాలో పౌరహక్కులపై అవగాహన సదస్సును తహసీల్దార్ రంగనాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ నరేంద్రరెడ్డి, రెడ్డిపల్లి వైద్యులు గణేనాయక్, వీఆర్‌ఓ వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయుడు చాప్లానాయక్, రామనాయక్, సిద్దునాయక్ పాల్గొన్నారు.

సిఫారసు బదిలీలకు స్వస్తి పలకాలి

కొత్తచెరువు, సెప్టెంబరు 30: వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకుల సిఫారసుల మేరకు ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలోనూ అదే తంతు జరుగుతోందని ఏపీటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. వాటికి స్వస్తి పలకక పోతే ఉద్యమాలు తప్పవని ఆ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరు శ్రీనివాసులు, రంగమ్మగారిచంద్ర, జిల్లా గౌరవాధ్యక్షుడు వీవీ మాధవ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నూతన ప్రభుత్వం ఏర్పడగానే అక్రమ బదిలీలు రద్దు చేయడమే కాకుండా సిఫారస్సు బదిలీలకు స్వస్తి పలుకుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అయితే కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు వారి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయులకు సిఫారస్సు లేఖలను అందిస్తున్నారన్నారు. దీన్ని ఖండిస్తున్నామన్నారు.

గూనిపల్లి టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్

బుక్కపట్నం, సెప్టెంబరు 30: మండలంలోని గూనిపల్లి ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ సికిందర్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. గూనిపల్లిగ్రామానికి చెందిన పలువురు ఉపాధి కూలీలు ఇటీవల కలెక్టర్‌ను కలిసి టెక్నికల్ అసిస్టెంట్ సికిందర్ తమ నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నివేదికలు ఇవ్వాలని డ్వామా పీడీని ఆదేశించారు. దీంతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన అధికారులు టెక్నికల్ అసిస్టెంట్ ప్రతి కూలి వద్ద రూ.వంద నుంచి రెండు వందల వసూలు చేసినట్లు విచారణలో తేలింది. అలాగే హార్టికల్చర్ పనులకు సంబంధించిన డబ్బులు వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఆ నివేదికలను కలెక్టర్‌కు పంపడంతో ఆయన ఆదేశాల మేరకు సికిందర్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 30: మండలంలోని నేలకోట, ఏలుకుంట్ల గ్రామాల్లో ప్రత్యామ్నాయ విత్తనాలను ఏఓ ముస్తాఫ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతుసేవాకేంద్రం సిబ్బంది గీతాంజలి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మోదుగులకుంట గ్రామంలో దర్శనమిస్తున్న మొండి గోడలు



20 ఏళ్ల నిరీక్షణ..!



చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

- పరిష్కారం కాని సీబీఆర్ ముంపు గ్రామాల సమస్య
- నేటికీ అందని పరిహారం
- అధికారుల నిర్లక్ష్యం... గ్రామస్థులకు శాపం

తాడిమర్రి, సెప్టెంబరు 30 : చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)ను నిర్మించి.. దాదాపు 20 సంవత్సరాలు అవుతున్నా... ముంపు గ్రామాల సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. మర్రిమాకులపల్లి, సీసీ రేవు గ్రామాల్లో సుమారు 200 మంది, మోదుగులకుంట, గుడ్డంపల్లి, పెద్దకోట్ల గ్రామాల్లో సుమారు 350 మంది పరిహారం కోసం నేటికీ ఎదురుచూస్తున్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను కడప జిల్లాలో నిర్మించగా... ముంపునకు గురైన భూములన్నీ ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందినవి. ఈ రిజర్వాయర్ నిర్మాణాన్ని 1989లో ప్రారంభించి.. 2005 సంవత్సరానికి 10 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. 2005లో నాటి ప్రభుత్వం సీబీఆర్ ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని జీఓ విడుదల చేసింది. అయితే ఆ మేరకు పరిహారం, ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదు. ఒక కుటుంబంలో 18 సంవత్సరాలు నిండినవారికి ఒక్కొక్కరికి రూ. 10 లక్షల ప్రకారం పరిహారం అందించాలని 2018లో ప్రభుత్వం మళ్లీ జీఓ విడుదల చేసింది. అయితే అందులో గతంలోనే ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వం నుంచి స్థలం కొని ఇళ్లు కట్టించుకున్న వారి పేర్లను జాబితా నుంచి అధికారులు తొలగించడంతో వారికి పరిహారం, ఎక్స్‌గ్రేషియా అందకుండాపోయాయి. తమకు నాడు ప్రభుత్వం అందించిన సొమ్మును పట్టుకొని.. మిగతా మొత్తాన్ని ఇవ్వాలని బాధితులు వేడుకొంటున్నా... నేటికీ వారి పరిహారం, ఎక్స్‌గ్రేషియా అందలేదు. ఇలాంటివారు మర్రిమాకులపల్లి, సీసీ రేవు, మోదుగులకుంట, గుడ్డంపల్లి, పెద్దకోట్ల గ్రామాల్లో సుమారు 550 మంది ఉన్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ఆర్డీఓ ఇచ్చిన నివేదిక మూలంగానే తమకు పరిహారం అందలేదని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. పైడిపాలెం, గండికోట, సర్వారాయునిపేట, తాళ్లపొద్దుటూరు వద్ద నిర్మించిన రిజర్వాయర్‌ల మూలంగా ముంపునకు గురైన వారికి అందజేసినట్లుగా... తమకూ పరిహారం అందించాలని సీబీఆర్ ముంపు బాధితులు కోరుతున్నారు.

కట్టుగుడ్డలతో వచ్చేశాం



1999లో వచ్చిన వరద నీరు మూలంగా పెద్దకోట్లతో పాటు మోదుగులకుంట కూడా పూర్తిగా మునిగిపోయింది. అప్పుడు కేవలం కట్టుగుడ్డలు, కొన్నిసామన్లతో ఊరి నుంచి బయటకు వచ్చేశాం. గత ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించకుండా నిర్లక్ష్యం చేసింది. ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఈ సమస్యపై దృష్టి సారించాలి. మమ్మల్ని ఆదుకోవాలి.

రవి, మోదుగులకుంట

జగన్‌ను విజ్ఞప్తి చేశాం



మా గ్రామాలకు ముంపు పరిహారం అందించాలని మాజీ సీఎం జగన్ దృష్టికి మూడు సార్లు తీసుకెళ్లాం. అయితే అక్కడున్న అధికారులు సరైన నివేధిక అందించకపోవడం వల్లే మాకు పరిహారం అందలేదు. సత్యసాయి జిల్లా ఏర్పడిన తరువాత నాలుగు సార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం మంత్రి సత్యకుమార్ దీనిపై స్పందించి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలి.

\- రమణారెడ్డి, మోదుగులకుంట

ఎస్ఐగా మగ్బుల్‌బాషా



నల్లచెరువు, సెప్టెంబరు 30: మండల నూతన ఎస్ఐగా మగ్బుల్‌బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతనను పుట్టపర్తి వీఆర్‌లో ఉంటూ బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ కెఎం. లింగన్న బదిలీపై పుట్టపర్తి రూరల్‌కు వెళ్లారు.

వలీబాషా..



నంబులపూలకుంట, సెప్టెంబరు 30: మండల ఎస్ఐగా వలీబాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను రొద్దం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున ఎస్ఐ శ్రీధర్ హిందూపురానికి బదిలీపై వెళ్లారు.

ఆర్డీఓగా మహేశ్



ధర్మవరం, సెప్టెంబరు 30 : సబ్ డివిజన్ ఆర్డీఓగా మహేశ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి విజయవాడ జేడీఎస్‌కు రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న మహేశ్‌ను ఇక్కడికి బదిలీ చేసింది.

డీటీగా నారాయణస్వామి



ముదిగుబ్బ, సెప్టెంబరు 30: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నారాయణస్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ ప్రసన్నకుమార్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. దీంతో కదిరి డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామిని ఇక్కడికి బదిలీ చేశారు.

బదిలీ అధికారులకు సన్మానం

నల్లచెరువు, సెప్టెంబరు 30 : మండలం నుంచి బదిలీపై వెళ్తున్న అధికారులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఎంపీపీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శకుంతలమ్మ, కార్యదర్శులు వసుంధర, రమణప్పనాయుడు, షమీర్‌లను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుపాల్‌నాయక్, సర్పంచ్ పంచరత్నమ్మ, ఎంపీటీసీ -1 లక్ష్మీ, నాయకులు క్రిష్టారెడ్డి, అన్నిశాఖాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

బదిలీ ఎంపీడీఓకు సన్మానం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 30 : ఎంపీడీఓ వరలక్ష్మీ కర్నూలు జిల్లాకు బదిలీ కావడంతో ఆమెను ఎంపీడీఓ కార్యాలయం, ఉపాధి సిబ్బంది సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రాజశేఖర్, ఏపీఓ సుధాకర్, ఈసీ ఆంజనేయులు, సీనియర్ సహాయకులు గజ్జల శ్రీనివాసరెడ్డి, సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ

పుట్టపర్తి : కలెక్టరేట్ వద్ద పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు సందర్భంగా వైద్య సిబ్బంది, విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని జేసీ అభిషేక్ కుమార్ ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ మంజువాణి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, ఐసీడీఎస్‌పీడీ నాగమల్లీశ్వరి పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నల్లమాడ : స్థానిక ఎస్సీ కాలనీ, చౌటకుంటపల్లిలో మంగళవారం నిరహించే పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొంటారని టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.



గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న స్వచ్ఛభారత్ కార్మికులు

వేతనాలివ్వకుంటే గ్రాసమే గతి

ధర్మవరం, సెప్టెంబరు 30 : ఇస్తున్న అరకొర వేతనం కూడా నెలలపాటు పెండింగ్ పెడితే ఎలా బతకాలని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతన బకాయిలు చెల్లించకుంటే గ్రాసమే తమకు గతి అంటూ సోమవారం ధర్మవరంలోని కళాజ్యోతి సర్కిల్‌లో వారు వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. మోకాళ్లపై కుర్చుని గడ్డితింటూ నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు తొలుత సీఐటీయూ కార్యాలయం నుంచి కళాజ్యోతి సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ అరగంటపాటు నిరసన తెలిపారు. ఇందులో సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, స్వచ్ఛభారత్ కార్మికులు నాగవేణి, లక్ష్మీదేవి, లక్ష్మి, వరలక్ష్మి, అంజినమ్మ పాల్గొన్నారు.

తుమ్మలబైలులో తాగునీటి సమస్యపై ఆందోళన



ఖాళీ బిందెలతో తుమ్మలబైలు గ్రామస్థుల నిరసన

గాండ్లపెంట, సెప్టెంబరు 30: మండలంలోని తుమ్మలబైలు గ్రామంలో తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్థులు ఖాళీ బిందెలతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నెలరోజుల క్రితం తమ గ్రామంలో విద్యుత్ మోటారు కాలిపోయిందని, అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలోని చేతి పంపులో నీరు అపరిశుభ్రంగా ఉన్నాయని, తప్పని పరిస్థితుల్లో వాటినే తాగుతున్నామని వాపోయారు. ఆ నీటిని తాగడం వలన దగ్గు, జలుబు, జ్వరాల బారినపడుతున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి మానసను వివరణ కోరగా... నెల క్రితం బోరు మోటారు కాలిపోవడంతో మరమ్మతులు చేశామన్నారు. గ్రామంలో కొంతమంది ఆకతాయిలు బోరు స్టాటర్ వైర్లను లాగేసి, స్టాటర్‌పై రాళ్లు వేశారని, దీంతో ఆ మోటారు కాలిపోయిందని అన్నారు. మళ్లీ మరమ్మతులు చేసి తాగునీటి సమస్య తీరుస్తామన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

తనకల్లు, సెప్టెంబరు 30 : రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు, రైతులు సోమవారం తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతిపత్రం అందించారు. రూ.రెండు లక్షల లోపు రుణాలు మాఫీ చేయాలని, ప్రభుత్వం ఇస్తామన్న రూ.20వేలు వెంటనే రైతుల ఖాతాలకు జమ చేయాలని, పంటనష్టపోయిన ప్రతి రైతుకు బీమా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమణ, వెంకటరమణ, శివన్న, సీఐటియ ఒంటెద్దు వేమన్న పాల్గొన్నారు.

పవన్‌కు సంఘీభావంగా దీపోత్సవం

కదిరి అర్బన్, సెప్టెంబరు 30: వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం కల్తీ సంఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రయాశ్చిత దీక్షకు మద్దతుగా సోమవారం పట్టణంలోని శివాలయంలో జనసేన నాయకులు దీపోత్సవం నిర్వహించారు. మంగళవారం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నమో నారాయణ మంత్రం జపిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భైరవ ప్రసాద్, చలపతి, రవికుమార్, రమణ, శ్రీనివాసులు, ప్రతాప్, రాజారాం, రఘు, సోముశేఖర్, ఆంజిబాబు, సరస్వతి పాల్గొన్నారు.

ధర్మవరం : స్థానిక కొత్తపేట వెంకటేశ్వరస్వామి జనసైనికులు సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి దంపతి సమేతంగా పాల్గొన్నారు. దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుమల పవిత్రతను అపవిత్రం చేసిన జగన్, సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ధర్మవరంలో దీపారాధన చేస్తున్న చిలకం, నాయకులు

గాండ్లపెంట: స్థానిక రామాలయంలో జనసేన మండల కన్వీనర్ రవినాయక్ ఆధ్వర్యంలో దీపోత్సవం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కురమామిడి సర్పంచ్ సుధాకర్, కూటమి నాయకులు దొనకొండ ఆనంద్, అక్రమ్‌బాషా, మోహన్, హరినాయక్, సేవాభారతి మండలాధ్యక్షులు వినోద్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, సోముశేఖర్, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.



కదిరి శివాలయంలో, గాండ్లపెంట రామాలయంలో దీపోత్సవం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

క్రైం న్యూస్ ..

యువకుడి ఆత్మహత్య

తనకల్లు, సెప్టెంబరు 30: మండలంలోని బీమ్లానాయక్ తండాకు చెందిన కొర్రా నానునాయక్ కుమారుడు కొర్రా వెంకటరమణనాయక్ (23) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటరమణ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. తల్లిదండ్రులు మొబైల్ ఫోన్ కొనివ్వగా.. దాన్ని పోగొట్టుకున్నాడు. మరో కొత్త ఫోన్ కొనివ్వగా.. దాన్నీ తనఖా పెట్టాడు. దీంతో తల్లిదండ్రులు మందలించగా.. జీవితంపై విరక్తి చెందిన వెంకటరమణ ఆదివారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న బంధువులు 108 వాహనంలో కదిరి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

యువతిపై అత్యాచారం - కేసు నమోదు

తాడిమర్రి, సెప్టెంబరు 30: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై అదే ఊరికి చెందిన నరసింహుడు ఆదివారం రాత్రి అత్యాచారానికి ఒడిగట్టాడు. ఎస్ఐ నాగాస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యువతి రాత్రి బహిర్భూమికి వెళ్లగా కాపుకాసిన నరసింహుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. దీనిపై యువతి కుటుంబీకులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు నరసింహుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాణసంచా స్వాధీనం

తనకల్లు, సెప్టెంబరు 30 : మండలంలోని కొక్కటి క్రాస్‌లో అనుమతులు లేకుండా నిల్వ చేసిన రూ.2.30 లక్షల విలువైన బాణసంచాను ఎస్ఐ గోపీ సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వాటిని సీజ్ చేయడంతో పాటు అతనిపై కేసు నమోదు చేశారు.



ధర్మవరం విద్యార్థులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

జాతీయస్థాయి పోటీల్లో సత్తా

ధర్మవరం, సెప్టెంబరు 30: కేరళలో ఈనెల 22, 23, 24 తేదీల్లో ఇండియా ఉమెన్స్ నేషనల్ వీఎన్‌కే ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి జూడో పోటీల్లో ధర్మవరం విద్యార్థిని కురుబ గవ్వల యువసంధ్య మైనస్ 28 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. మరో విద్యార్థిని అక్షయ్ గుజరాత్‌లో అక్టోబరు 3 నుంచి 8వ తేదీ వరకు జరిగే స్కూల్‌గేమ్స్ జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైంది. దీంతో సోమవారం ఈ విద్యార్థులను టీడీపీ నాయకులు సంధారాఘవ, సంధారవి సన్మానించారు. ఒక్కో విద్యార్థికి రూ.10 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాంగళ్య శిల్క్స్ యజమాని జింకాపురుషోత్తం, ఆదిత్య పాఠశాల కరస్పాండెంట్ జనార్దన్, కోచ్ ఇనాయాత్ బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

గాండ్లపెంట, సెప్టెంబరు 30: స్వర్ణాంధ్ర- 2024 వ్యాసరచన పోటీల్లో గాండ్లపెంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని సిఫాకనుమ్ మొదటి బహుమతి సాధించింది. సోమ వారం పుట్టపర్తిలో ఆ విద్యార్థికి డీఈఓ మీనాక్షి ప్రసంసా పత్రాన్ని అందజేశారు. ఆ విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు సిద్ధారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



సిఫాకనుమ్‌కు ప్రసంసాపత్రం అందిస్తున్న డీఈఓ

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



కదిరి(అమడగూరు), సెప్టెంబరు 30 : స్థానిక జిల్లాపరిషత్, కస్తూర్బా పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. అండర్ 17 వాలీబాల్‌లో గౌతమ్‌కుమార్, అండర్ 14 కబడ్డీ కె. జయంత్, బాలికల విభాగంలో ఎ. చందన, కస్తూర్బా పాఠశాల నుంచి అండర్ 14 యోగాలో భూమి, వైష్ణవి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఉత్సాహంగా స్వచ్ఛతా హీ సేవ

ధర్మవరం రూరల్: మండలంలోని గొట్లూరులో సోమవారం నిర్వహించిన మండల స్థాయి స్వచ్ఛత హీ సేవ కల్చరల్ ప్రోగ్రాం ఉత్సాహంగా సాగింది. ఎంపీడీఓ అబ్దుల్‌నబీ, ఈఓఆర్డీ మమతదేవి ఆధ్వర్యంలో కీలుగుర్రాలు, కోలాటం కళాకారులు, విద్యార్థులు, గ్రామస్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. సచివాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో కళాకారులు తమ ప్రదర్శనలు నిర్వహించారు. స్వచ్ఛతహీసేవ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపీపీ గిరక రమాదేవి, సర్పంచ్ పిట్టానరసమ్మ, మంత్రి కార్యాలయ సిబ్బంది హరీష్, టీడీపీ మాజీ కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ



ఆనంద్‌కుమార్

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 30 : పెనుకొండ డివిజన్ రెవెన్యూ అధికారిగా ఆనంద్‌కుమార్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయనకు తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలు, సర్వేయర్లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైతులు మా సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు.

పెనుకొండ ఎక్సైజ్ సీఐగా సృజన్‌బాబు..



పెనుకొండ ఎక్సైజ్ సీఐగా సృజన్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా సీఐగా పనిచేస్తున్న ఈయన బదిలీల్లో భాగంగా పెనుకొండకు వచ్చారు. కల్తీకల్లు, అక్రమ నాటుసారాపై నిఘా ఉంచుతామని పేర్కొన్నారు.

'పురం'ఎక్సైజ్ సీఐగా లక్ష్మీదుర్గయ్య



హిందూపురం, సెప్టెంబరు 30 : హిందూపురం ఎక్సైజ్ సీఐగా లక్ష్మీదుర్గయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న సీఐ రాజశేఖర్‌గౌడ్ పదోన్నతిపై బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న లక్ష్మీదుర్గయ్యను హిందూపురానికి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక నుంచి మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతలు చేపట్టిన సీఐకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు..



పెనుకొండ టౌన్, సెప్టెంబరు 30 : డివిజన్ కేంద్రమైన పెనుకొండలో ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం పెనుకొండ స్టేషన్ ఎస్‌ఐగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ రాజేష్ కియా స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బదిలీ ల్లో భాగంగా చెన్నేకొత్తపల్లి నుంచి వెంకటేశ్వర్లు పెనుకొండకు వచ్చారు.

ఎంపీడీఓగా యాదవేంద్ర..



అగళి, సెప్టెంబరు 30 : మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సేవలందిస్తానని ఎంపీడీఓ యాదవేంద్ర పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై అగళి మండలానికి ఎంపీడీఓగా సోమవారం వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ రబ్బానీ ఉరవకొండకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీఓను సన్మానించారు.

పాఠశాలల తనిఖీ

రొళ్ల, సెప్టెంబరు 30 : మండలంలోని కాకి జిల్లాపరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాధికారి శ్రీధర్ సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలల రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధన, బోధనేతర సామగ్రి, డైరీలు, లెసన్ ప్లాన్లను పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ, నాణ్యతను రుచిచూశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం, ఇతర సౌకర్యాలను కల్పించడంలో అలసత్వం ప్రదర్శించకూడదని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 30 : మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని టీంజ్యోతి కరెక్షన్ సంస్థ సొసైటీ కార్యనిర్వాహక అధికారి కవిత తెలిపారు. సోమవారం పట్టణంలోని అర్బన్ కాలనీలో మహిళలకు ఉచిత న్యాయసేవా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహిళలు సమాజంలో ఏ విధంగా మెలగాలి, కుటుంబంలో పిల్లలపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. నాటిక రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దుర్గాసొసైటీ అధ్యక్షురాలు ముంతాజ్‌బేగం, మహాశక్తి సీతక్క రమేష్, ప్రోగ్రాం అసోసియేట్ పావని, దుర్గాశక్తి, మహాశక్తి పొదుపు సభ్యులు పాల్గొన్నారు.

6న అగళి సంత ప్రారంభం

అగళి, సెప్టెంబరు 30 : మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల వద్ద అక్టోబరు 6న సంతను ప్రారంభించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రంగనాథ్, సర్పంచ్ లక్ష్మమ్మ తెలిపారు. గతంలో సంత మార్కెట్ జరిగేది, కరోనా నేపథ్యంలో మూసివేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. కూరగాయలతోపాటు పశువుల సంత కూడా జరుగుతుందన్నారు.

నేడు రొద్దంలో మంత్రి సవిత పర్యటన

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 30 : రొద్దం మండలంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి సవిత పాల్గొననున్నట్టు టీడీపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు తురకలాపట్నం గ్రామంలో పింఛన్ల పంపిణీ, 11 గంటలకు తురకలాపట్నం బస్టాండు నుంచి పెద్దిపల్లి వరకు సీసీరోడ్డుకు భూమిపూజ కార్యక్రమాల నిర్వహిస్తారన్నారు.

మండల సమాఖ్యకు నూతన కార్యవర్గం

మడకశిరటౌన్, సెప్టెంబరు 30 : మడకశిర మండల సమాఖ్య 22వ వార్షికోత్సవాన్ని సోమవారం పట్టణంలోని సమాఖ్య కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో కొత్త పాలక మండలిని ఎన్నుకున్నారు. 2023-2024 వార్షిక నివేదిక సంబంధించి చర్చ నిర్వహించి ఆమోదించారు. ఆడిటింగ్ ఆడిట్ నివేదికపై చర్చించారు. వచ్చే సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రణాళికను రూపొందించడం పట్ల చర్చ నిర్వహించారు. కొత్త అధ్యక్షురాలిగా ఆదిలక్ష్మమ్మ, కార్యదర్శిగా ఇంద్రజ, కోశాధికారిగా పరిమళతోపాటు సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏపీఎం రవి, శ్రీనిధి మేనేజర్ నరేంద్ర, సీసీ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.



ఎంపికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

పిడుగు బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ

- రూ.8.75 లక్షల ఎక్స్‌గ్రేషియా పంపిణీ



జగదీష్‌నాయక్‌కు చెక్కును అందజేస్తున్న మంత్రి సవిత

గోరంట్ల, సెప్టెంబరు 30: మండలంలోని దిగువగంగంపల్లితండాలో పిడుగుపడి మృతిచెందిన దశరథనాయక్ కుటుంబ సభ్యులను బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం మంజూరుచేసిన రూ.8.75లక్షల చెక్కును అందించారు. తండాలో ఆదివారం పిడుగు పడి దశరథనాయక్, దేవిబాయితో పాటు రెండు పాడిఆవులు మృతి చెందాయి. వారికుమారుడు జగదీష్‌నాయక్ ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం గ్రామానికి చేరుకున్నారు. మృతిచెందిన దంపతుల చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అన్నిరకాల సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఇద్దరు మృతి చెందడంతో ఒక్కొక్కరికి రూ. 4లక్షల వంతున, రెండు ఆవుల కు కలిపి రూ.75వేలు మొత్తం రూ.8.75లక్షలను కుమారుడు జగదీష్‌నాయక్‌కు అందజేశారు. ప్రాథమిక పాఠశాల ప్రహరీ శిథిలావస్థ, వర్షపు నీరు నిలువ ఉండటాన్ని తండావాసులు మంత్రికి చెప్పారు. దీంతో ఆమె పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సుభద్రా, గిరిజన సంక్షేమశాఖాధికారి మోహన్‌రావు, పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆర్థిక సాయం

గోరంట్ల మండలంలోని దిగువగంగంపల్లి తండాలో పిడుగుపాటుకు మృతిచెందిన కుటుంబ సభ్యులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ సోమవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. గాయపడిన జగదీష్‌నాయక్‌కు ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌ద్వారా పూర్తిగా నయం అయ్యేవరకు చికిత్సలు జరిగేలా చూస్తామని చెప్పారు. హిందూపురం పార్లమెంటు సోషల్ మీడియా కోఆర్డినేటర్ హేమలతబాయి రూ.10వేలు నగదు అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదాం : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, సెప్టెంబరు 30 : మడకశిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతోనే ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని మార్కెట్‌యార్డులో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చివరి క్షణంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి మడకశిరకు పంపినా మీ అందరి సహకారం వల్ల తక్కువ సమయంలోనే విజయం సాధించా అన్నారు. అభ్యర్థిగా వచ్చిన సమయంలో ప్రతిపక్ష పార్టీలు తనపై అనేక ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేసినా నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి, నాయకులు తిప్పికొట్టి తన విజయానికి బాటలు వేశారని అన్నారు. రూ.25కోట్ల సీసీ రోడ్లు మంజూరయ్యాయని, రోడ్డులేని గ్రామాల్లో మొదటి ప్రాధాన్యతను ఇచ్చి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ఈనెల 2 నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కాబోతోందన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జులతోపాటు మండల, పంచాయతీ స్థాయి నాయకులు సమన్వయంతో నియోజకవర్గాన్ని సభ్యత్వంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుదామని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి గడపకు వెళ్లి వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టే బాధ్యత మీఅందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కులవివక్షకు తావులేదు: ఎస్పీ



పౌర హక్కుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

గోరంట్ల, సెప్టెంబరు 30 : భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికి హక్కులు ప్రసాదించిందని, ఎక్కడా కులవివక్షకు తావులేకుండా ప్రతిఒక్కరు కృషిచేయాలని జిల్లా ఎస్పీ వి. రత్న తెలిపారు. మండలంలోని వానవోలు గ్రామ ఎస్సీకాలనీలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మనిషి తోటి మనిషిని గౌరవించే సమాజం వర్ధిల్లాలని, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు సంక్షేమఫలాలు సమానంగా అందుతాయన్నారు. చట్టాలపై అందరికీ అవగాహన కలిగినప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ కాలనీ వాసులు గ్రామంలో హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి ఉందని, పిల్లలు, పెద్దలు షేవింగ్, కటింగ్ కోసం గోరంట్లకు వెళ్లాల్సి వస్తోందని, ఆశ్వర్థం కట్టవద్ద పూజలకు తమను అనుమతించడంలేదని ఆమెకు తెలిపారు. వెంటనే ఎస్పీ స్పందిస్తూ యేళ్ల తరబడి వస్తున్న సమస్యను, సంప్రదాయాన్ని రూపు మాపడానికి సామరస్యపూర్వకంగా మార్పు తీసుకురావాలన్నారు. సున్నితమైన సమస్యను ఒప్పుకోవాల్సి ఉంటుందని, మారుస్తామని చెప్పారు. కొంత సమయం పడుతుందని, మూడు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, ట్రాన్స్‌కో ఏఈ బాలకృష్ణనాయక్, లీగల్ అడ్వైజర్ వెంకటసుబ్బానాయక్, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

గోరంట్ల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రత్న సోమవారం రాత్రి తనిఖీ చేశారు. మండలంలో వానవోలు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆమె అనంతరం స్టేషన్‌కు వెళ్లి రికార్డులు, రిసెప్షన్ కౌంటర్, పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరాతీశారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పనిచేయాలన్నారు. దొంగల నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తూ, గంజాయి, జూదం, చట్ట వ్యతిరేక కార్యక్రమాలను అరికట్టాలన్నారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఆమెతోపాటు సీఐ శేఖర్, ఎస్ఐ ఎస్ ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు నారపల్లి రమణ

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 30 : భవన నిర్మాణ కార్మిక రంగాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు నారపల్లి రమణ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పనులు లేక బెంగళూరు, చెన్నైకు అనేకమంది కార్మికులు వలస వెళ్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం అవలంబించిన కార్మిక వ్యతిరేక విధానాలు భవన నిర్మాణ రంగాన్ని కుదేలు చేశాయని అన్నారు. ఇసుక సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా చేసిందన్నారు. దీంతో నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయి కూలీలకు వలస బాట తప్పలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 120 రోజులయిందని ఇంతవరకు ఉచిత ఇసుక విధానం అందుబాటులోకి రాలేదన్నారు. వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. ఇదే డిమాండ్లతో అక్టోబరు 4న రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాంబశివ, రామక్రిష్ణ, రంగప్ప, అన్నమయ్య, అంజినేయులు, సర్వేశ, వెంకటేశులు, నాగభూషణ, రవి, కిరణ్, సురేష్, రామాంజి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ రాలేదని కౌన్సిల్‌మీట్ వాయిదా

పెనుకొండ, సెప్టెంబరు 30 : స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన అత్యవసర కౌన్సిల్‌సమావేశం వాయిదా పడింది. సోమవారం 11గంటలకు జరగాల్సిన సమావేశాన్ని మధ్యాహ్నం 3గంటలకు వాయిదా వేశారు. మధ్యాహ్నం సమావేశానికి చైర్మన్, వైస్ చైర్మన్‌లతోపాటు 20మంది కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. సాయంత్రం 4.30వరకు వేచి చూసినా కమిషనర్ రాకపోవడంతో చైర్మన్ ఫరూక్ కలగజేసుకుని అజెండాలోని అంశాలను రద్దుపరచి సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. వచ్చే సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చ జరుపుతామన్నారు. మున్సిపల్ కమిషనర్, కార్యాలయ సిబ్బంది రాకపోవడంతోనే సమావేశం వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ అనివార్య కారణాలవల్ల మంత్రి ఆదేశాల మేరకు కౌన్సిల్‌మీటింగ్‌ను వాయిదా వేసినట్లు తెలిపారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

అగళి, సెప్టెంబరు 30 : ఉపాధిహామీ పథకం కొత్త పనులపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యాదవేంద్ర, సీపీఓ శివన్న తెలిపారు. 2025-26 సంవత్సరానికి ఆర్థికంగాను ఈ పనులు ప్రణాళిక తయారు చేస్తామన్నారు. అగళి గ్రామ సచివాలయంలో బుధవారం ఉదయం 10గంటలకు, హళ్లికెర గ్రామ సచివాలయం మధ్యాహ్నం 12గంటలకు, హెచ్‌డిహళ్లి గ్రామ సచివాలయం ఉదయం 10గంటలకు, ఇనగలూరు, ఇరిగేపల్లి సచివాలయాల్లో 10గంటలకు, కొమరేపల్లి బీరలింగేశ్వరస్వామి దేవాలయం, మధూడి గ్రామ సచివాలయం, పి బ్యాడిగెర గ్రామ సచివాలయం, తదితర గ్రామాలలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామ సభలకు కూలీలు, శ్రమశక్తి సంఘాల సభ్యులు, స్వయం సహాయ సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు హాజరై కొత్త పనులు ఎంపిక చేయాలని కోరారు.

వైద్యులను నియమించండి

ఈఎస్ఐ ఆసుపత్రి సమస్యలపై ఏఐటీయూసీ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 30: ఈఎస్ఐ ఆసుపత్రికి వైద్యులు, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సోమవారం స్థానిక గాంధీ సర్కిల్ నుంచి ఈఎస్ఐ ఆసుపత్రి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిందూపురం పరిధిలో 35 వేల మంది కార్మికులు ఉన్నారని, వారందరూ ఈఎస్ఐకి డబ్బు చెల్లిస్తున్నారని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. నలుగురు వైద్యులకు గాను ఒక్కరే ఉన్నారని, మడనపల్లి నుంచి డిప్యుటేషన్ వేయడంతో వారానికి ఒక్క సారి వచ్చి వెళ్తున్నారని అన్నారు. ఇలాంటి సమయంలో కార్మికులకు వైద్య సేవలు ఎలా అందుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. కార్మికులకు పూర్తి స్థాయిలో మందులు అందడం లేదన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి హిందూపురంలో 40 పడకల సొంత ఆసుపత్రి భవనాన్ని నిర్మించి, సిబ్బంది కొరత తీర్చాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వినోద్‌కుమార్, బాబు, రవికుమార్, మారుతిరెడ్డి, సమీవుల్లా, కమలబాషా, శివన్న, నరసింహులు, సురేష్, పాల్గొన్నారు.

వక్క మార్కెట్‌కు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 30 : అమరాపురం మండల పరిధిలోని ఉదుగూరు గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో మార్కెట్‌యార్డు ఏర్పాటు చేయడానికి మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ రామాంజనేయులు సోమవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయానికి ఈప్రాంతంలోని రైతులు తమలపాకులకు గిట్టుబాటు ధర లేదని ఫిర్యాదు చేయడంతో పరిశీలన నిమిత్తం వచ్చినట్లు పేర్కొన్నారు. తమ్మడేపల్లి తదితర ప్రాంతాల్లోని పర్యటనలో పలువురు రైతులతో మాట్లాడి వారి పరిస్థితులను అధ్యయనం చేసినట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌యార్డు స్థలాన్ని పరిశీలించి అనువుగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందజేసి త్వరలో వక్కమార్కెట్ ఏర్పాటు చేయడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం నరసింహమూర్తి, టీడీపీ నాయకులు ఉగ్రనరసింహ, మాజీ సర్పంచ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.7.86 లక్షల సాయం



మంత్రి లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న ముత్తవల్లీల సంఘం నాయకులు

పెనుకొండ , సెప్టెంబరు 30 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర ముత్తవల్లి అసోసియేషన్ సేకరించిన రూ.7.86 లక్షలను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. సోమవారం మంత్రిలోకేశ్‌ను కలిసిన అసోసియేషన్ నాయకులు షాకీర్, షఫీ, పెనుకొండ దర్గాపీఠాధిపతి తాజ్‌బాబా, ఉబేదుల్లా, మదనపల్లి దర్గాపీఠాధిపతి అబ్దుల్ హుస్సేన్ తదితరులు చెక్కును అందజేశారు. పెనుకొండ దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా రూ.2లక్షలు ఇచ్చినట్లు తెలిపారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులు వీరే..

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 30: స్థానిక ఎంజీఎం మైదానంలో సోమవారం శ్రీసత్యసాయి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్టు ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ తెలిపారు. 30 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. టీమ్ క్యాంప్ నిర్వహించి ఇందులో నుంచి మరికొంత మందిని తుది జట్టును ఎంపిక చేస్తారు. వీరు త్వరలో జరుగు రాష్ట్ర స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి శేఖర్, కార్యదర్శి మహ్మద్ నసీమ్, ఉపాధ్యక్షుడు ఇర్షాద్ అలీ, కోచ్‌లు రామచెంద్ర, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ పోటీలకు..



విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 30 : రొద్దం మండలం బోయపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబశివారెడ్డి, పీఈటీ మమత తెలిపారు. ఈనెల 23న కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో రాహుల్, అండర్-14లో వేణు ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు.

పౌరహక్కులపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

లేపాక్షి, సెప్టెంబరు 30 : భారత రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హిందూపురం డీఎస్పీ మహేష్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మత బేధాలు లేకుండా అందరూ శాంతియుతంగా సోదరభావంతో మెలగాలన్నారు. పౌరహక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో హిందూపురం రూరల్ సీఐ జనార్దన్, ఎస్ఐ నరేంద్ర, ప్రజలు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి : డీఎస్పీ

పెనుకొండ, సెప్టెంబరు 30 : విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి సేవా దృక్పథంతో కలిగి ఉండాలన్నారు. ఉన్నతమైన లక్ష్యాన్ని కలిగి అత్యున్నత స్థానాల్లో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు చిన్నపరెడ్డి, రవికుమార్, జనార్దన్, విజయలక్ష్మి, సిబ్బంది అల్లాబకష్ మౌలా విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెనుకొండ, సెప్టెంబరు 30 : స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-2047 అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ల పూర్తిచేసుకున్న సమయానికి మన రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని వైస్ ప్రిన్సిపాల్ జయప్ప పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : స్వర్ణాంధ్ర విజన్ 2047లోను ప్రతిఒకరు కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో స్వర్ణాంధ్ర మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త అధ్యక్షత జరిగినసమావేశంలో అధికారులు తమ శాఖలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, ఎంఈఓలు జానకిరామ్, గోపాల్, ఏఓ మునిక్రిష్ణ, ఏపీఓ వరప్రసాద్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.